https://teluguislam.net



# గజ్వయె బనీయిల్ ముస్తలిక్

## (హిజ్రీ శకం 5 లేక 6)

ఈ గజ్వా, యుద్ధం దృష్టికోణంతో చూస్తే, ఓ ముఖ్యమైన గజ్వా మాత్రం కాకపోయినప్పటికి దాని ప్రాధాన్యత మాత్రం గొప్పదే. కారణం, ఆ గజ్వాలో చోటు చేసుకున్న సంఘటనలు ఇస్లామీయ సమాజంలో పెద్ద సంచలనాన్ని రేకెత్తించాయి. దాని ఫలితంగా ఓ వైపు మునాఫిక్‌ల కాపట్యం కాస్తా బయట పడిపోతే, మరోవంక ఇస్లామీయ సమాజానికి గౌరవం మరియు ఔన్నత్యాన్ని చేకూర్చిపెట్టిన క్రిమినల్ చట్టాలు అవతరించాయి. దీనివల్ల దానికి ఓ ప్రత్యేక రూపం వచ్చినట్లయింది. మొదట మేము ఆ గజ్వాకు సంబంధించిన వివరాలను చెప్పి ఆ తరువాత ఆ సంఘటనలేవో చెబుతాము.

ఈ గజ్వా - సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, హిజ్రీ శకం 5, షాబాన్ నెల లేదా హిజ్రీ శకం 6లో[1] సంభవించింది- ఈ గజ్వా కోసం వెళ్ళడానికి గల కారణాలు ఏమిటంటే, దైవప్రవక్త (స)కు, బనూ ముస్తలిక్ సర్దారు హారిస్ బిన్ అబీ జరార్ యుద్ధానికి సిద్ధమై తన తెగలతో ఇంకా ఇతర అరబ్బులతో కలసి వస్తున్నాడని వార్త అందడమే. మహాప్రవక్త (స) బరీదా బిన్ హసీబ్ అస్లమీ (ర) గారిని అది ఎంత వరకు నిజమో తెలుసుకురమ్మని పంపించారు. ఆయన బనూ హారిస్ నాయకుడు హారిస్ బిన్ అబీ జరార్‌ను కలసి మాట్లాడారు. తిరిగి వచ్చి విషయమంతా మహాప్రవక్త (స)కు విన్నవించుకున్నారు.

ఈ వార్త నిజమే అన్న విషయం తెలియగానే మహాప్రవక్త (స), సహాబా (ర)ను బయలుదేరడానికి సిద్ధంకమ్మని ఆదేశం ఇచ్చారు. ఆ తరువాత ఆయన త్వరలోనే అటు వైపునకు బయలుదేరి వెళ్ళారు. ముస్లిముల సైన్యం షాబాన్ నెల 2వ తారీఖున బయలుదేరింది. ఈ గజ్వాలో దైవప్రవక్త (స) వెంట

---

1. *ఈ గజ్వా నుండి వెనక్కు మళ్ళేటప్పుడు ఇఫక్ (హజ్రత్ ఆయిషా (ర) పై అపనింద వేసే) సంఘటన జరిగింది.*

https://teluguislam.net



మునాఫిక్‌ల ఓ వర్గం కూడా ఉంది. ఇంతకు పూర్వం వారు ఏ యుద్ధంలోనూ పాల్గొన్నవారు కారు. ఆయన (స) మదీనా బాధ్యతల్ని హజ్రత్ జైద్ బిన్ హారిసాకు (మరో ఉల్లేఖనంలో అబూ జర్ (ర)కు, ఇంకో ఉల్లేఖనంలో నమీలా బిన్ అబ్దుల్లాహ్(ర)కు) అప్పగించారు. హారిస్ బిన్ జరార్, ఇస్లామీయ సేన ఆచూకి తెలుసుకోడానికి ఓ వేగులవాణ్ణి పంపగా ముస్లిములు అతణ్ణి పట్టుకొని హతమార్చారు.

హారిస్ బిన్ అబీ జరార్‌కు, అతని అనుచరులకు దైవప్రవక్త (స) బయలుదేరడం మరియు తమ వేగులవాడు హతమార్చబడటం తెలిసి భయ భీతులయ్యారు. ఏ అరబ్బులయితే వారి వెంట బయలుదేరారో వారంతా చెల్లాచెదరై పారిపోయారు. మహాప్రవక్త (స) 'మురైసీ'[2] అనే ఊట బావి వద్దకు చేరుకోగా బనూ ముస్తలిక్ యుద్ధానికి సిద్ధమై ముందుకు వచ్చేశారు. మహాప్రవక్త (స) తన సేనను వరుసలుగా నిలబెట్టి సేనా పతాకాన్ని హజ్రత్ అబూ బక్ర్ (ర) చేతికి ఇచ్చారు. అలాగే అన్సారుల ప్రత్యేక పతాకం ఒకటి హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర) చేతిలో ఉంది. కొంతసేపటి వరకు ఇరు పక్షాల నడుమ ధనుర్యుద్ధం జరిగింది. ఆ తరువాత మహాప్రవక్త (స) ఒక్కసారే వారిపై దాడి చేసి విజయం సాధించారు. బహుదైవారాధకులకు ఓటమి ఎదురైంది. కొందరు చంపబడ్డారు. స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టు కోవడం జరిగింది. అలాగే వారి మేకలు, పశువులు ముస్లిముల చేత చిక్కాయి. ముస్లిములకు చెందిన ఒకే ఒక వ్యక్తి హతుడయ్యారు. అది కూడా ఓ అన్సారీ ఆయన్ని శత్రువుకు చెందిన మనిషిగా భావించి చంపడం జరిగింది.

సీరత్ చరిత్రకారులు ఈ గజ్వా వివరాలను ఇంతవరకే చెప్పారు. కాని అల్లామా ఇబ్నె ఖైమ్ మాత్రం యుద్ధం జరగలేదని రాశారు. కేవలం దైవప్రవక్త (స) ఆ ఊట బావిపై దాడి చేసి స్త్రీలను, పిల్లల్ని, పశువుల్ని పట్టుకోవడం మాత్రమే జరిగింది అని అంటారు. 'సహీహ్' హదీసులలోని ఓ ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) బనూ ముస్తలిక్‌పై దాడి చేసినప్పుడు వారు ఏమరుపాటులో ఉన్నారని ఉంది.[3]

---

2. మురైసీ అనే ఊట బావి ఖదీర్‌కు దాపులో ఉంది. ఇది సముద్ర తీరంలోని బనూ ముస్తలిక్‌కు చెందిన ఊట బావి.
3. చూడండి, సహీహ్ బుఖారి, కితాబుల్ ఇత్క్-1/345, ఫత్హుల్ బారి-7/431

https://teluguislam.net



ఖైదీల్లో హజ్రత్ జువైరియా (ర) కూడా ఉన్నారు. ఈమె బనూ ముస్తలిక్ నాయకుడు హారిస్ బిన్ అబీ జరార్ కుమార్తె. ఈమె సాబిత్ బిన్ ఖైస్ వాటాకు వచ్చిన మహిళ. ఆయన ఆమెను 'మకాతిబ్'[4] చేసి తన వద్ద ఉంచుకున్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆయనకు, నిర్ణీత ధనమిచ్చి స్వతంత్రురాలిగా చేసి వివాహం చేసుకున్నారు. ఈ వివాహం కారణంగా, ఓ వంద మంది బనూ ముస్తలిక్ కుటుంబం వారు ముస్లిములైపోయారు. వారిని విడుదల చేయడం జరిగింది. ముస్లిములు వారిని విడుదల చేస్తూ, వీరు మహాప్రవక్త (స) గారి అత్తగారి కుటుంబానికి సంబంధించిన వారు అని చెప్పుకున్నారు కూడా.[5]

ఇవీ ఆ గజ్వాకు సంబంధించిన వివరాలు. ఇక ఆ గజ్వా సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనల విషయానికి వస్తే, వాటికి మూలకారణం మునాఫిక్‌ల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరులే. ఇస్లామీయ సమాజంలో వారి నడవడి, వారు అవలంబించిన వైఖరి ఎలాంటిదో చెప్పుకోవడం ఎంతైనా అవసరం. ఈ వివరాలు మనం తరువాత తెలుసుకుందాం.

## గజ్వయె బనీ ముస్తలిక్‌కు పూర్వం మునాఫిక్ అవలంబించిన వైఖరి

అబ్దుల్లా బిన్ ఉబైకు ఇస్లామ్ మరియు ముస్లిముల ఎడల సాధారణంగాను, దైవప్రవక్త (స) ఎడల ప్రత్యేకంగాను కక్ష ఉన్న విషయం మనం ఇదివరకు చెప్పుకొన్నదే. ఎందుకంటే, అవస్, ఖజ్రజ్ తెగలు దైవప్రవక్త (స) మదీనాకు రాకపూర్వం అతణ్ణి తమ నాయకునిగా చేసుకోడానికి ఏకగ్రీవంగా తీర్మానించుకొని ఉన్నారు. అతని తలపై కిరీటం పెట్టి తమ రాజుగా చేసుకోవడానికి ఓ పగడాల కిరీటం కూడా తయారు చేసుకుని ఉన్నారు. అంతలోనే మదీనాలో ఇస్లామ్ వెలుగు విస్తరించనారంభించింది. వారి దృష్టి కాస్తా అతని వైపు నుండి మళ్ళిపోయింది. అందుకని అతను, దైవప్రవక్త (స) అతని రాచరికాన్ని లాక్కున్నారని బాధపడిపోతున్నాడు.

ఇతని ఈ కక్ష, హిజ్రత్ ప్రారంభం అయినప్పటి నుండే కొనసాగుతూ ఉంది. అప్పుడు అతను ఇస్లామ్ స్వీకరించి ఉండలేదు. ఆ తరువాత తాను

---

4. 'మకాతిబ్' అంటే తన జమానత్‌తో ఓ నిర్ణీత ధనం ఇచ్చి విడుదల అయ్యే ఒప్పందం కుదుర్చుకునే బానిస లేక బానిసరాలు అని అర్థం.
5. *అజాదుల్ మఆద్-2/112, 113, ఇబ్నె హష్షామ్-2/289, 294, 295.*

https://teluguislam.net



ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించిన తదుపరి కూడా అతని వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించక ముందు ఓసారి దైవప్రవక్త (స) గారు కంచర గాడిదపై ఎక్కి హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర) గారిని పరామర్శించడానికి వెలుతూ ఉండగా ఓ చోట అబ్దుల్లా బిన్ ఉబై తన సహచరులతో పిచ్చాపాటి మాట్లాడుతున్నాడు. అతను దైవప్రవక్త (స)ను చూడగానే తన ముక్కుకు అడ్డంగా గుడ్డను పెట్టుకుంటూ, అనవసరంగా దుమ్మురేపవద్దు అని హెచ్చరించాడు కూడా. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడ ఆగి ఆ సమూహం వినేటట్లు దివ్యఖుర్ఆన్ పారాయణం చేయగా అతను, "మీరు మీ ఇంట్లోనే ఉండండి. అనవసరంగా మా దగ్గరకు వచ్చి మమ్మల్ని చీకాకుపరచకండి" అని అన్నాడు.[6]

ఇది ఇస్లామ్ ధర్మం స్వీకరించడానికి పూర్వపు మాట. కాని బద్ర్ యుద్ధం తరువాత గాలివాటం చూసి అతను ముస్లిమ్ అయినట్లు ప్రకటించు కున్నాడు. అప్పటికి అతను అల్లాహ్, ఆయన ప్రవక్త (స), విశ్వాసుల ఎడల శత్రుత్వం వహిస్తూనే ఉన్నాడు. ఇస్లామీయ సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించ డానికి, ఇస్లామ్ పిలుపును బలహీనపరిచేందుకు సతతం కుట్రలు పన్నుతూనే ఉన్నాడు. ఇస్లామ్ విరోధులతో సత్సంబంధాలను ఏర్పరచుకుంటూనే ఉన్నాడు. బనూ ఖైనుఖా వ్యవహారంలో అతను అనవసరంగా జోక్యం చేసుకోవడం జరిగింది (ఆ వివరాలు వెనుకటి పుటల్లో మనం చదువుకున్నవే). అలాగే ఉహద్ పోరాట సమయంలోనూ కుట్రపన్ని ముస్లిముల్లో చీలిక తేవ డానికి ప్రయత్నం చేశాడు.

ఈ మునాఫిక్ కుతంత్రాలు ఎలా సాగాయంటే, అతని ఇస్లామ్ స్వీకారం తరువాత ప్రతి జుమా రోజున, దైవప్రవక్త (స) జుమా ప్రసంగం కోసం లేచి నిలబడక ముందే తాను నిలబడి, "ప్రజలారా! ఈయన గారు మీ నడుమ నిలుచున్న వ్యక్తి దైవప్రవక్త (స). అల్లాహ్ ఆయన ద్వారా మీకు గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చేకూర్చాడు. కాబట్టి మీరు ఆయనకు సహాయంగా ఉండండి. ఆయన మాటలను విని వాటి ప్రకారం నడుచుకోండి" అని చెప్పి కూర్చునే వాడు. ఆ తరువాత లేచి దైవప్రవక్త (స) ప్రసంగించేవారు. ఇలా చేయడం అతనికి అలవాటుగా మారింది (కారణం అందరూ అతణ్ణి నిజమైన ముస్లిమ్

6, ఇబ్నె హష్షామ్-1/584-587; సహీ బుఖారి-2/924; సహీ ముస్లిమ్-2/109

https://teluguislam.net



అనుకోవాలని). అయితే ఉహద్ యుద్ధం ముగిసిన తరువాత మొదటి జుమా (శుక్రవారం) రాగానే- ఆ యుద్ధంలో అతను ఓ పెద్ద ద్రోహానికి పాల్పడి నప్పటికీ - లేచి ఇదివరకటిలా తన మాటలను వల్లించసాగాడు. కాని ఈసారి ముస్లిములు అన్ని వైపుల నుంచి అతణ్ణి చుట్టుముట్టి చొక్కాబట్టి క్రింద కూర్చోబెడుతూ, "ఓ దైవ విరోధీ! కూర్చో. నీవు చేసిన ద్రోహానికి తిరిగి ఆ మాటలు పలికే అర్హత నీకు లేదు." అనగా, అతను మనుషుల తలలపై నుండి దాటుకుంటూ, "నేను వారి ప్రవక్త (స)ను బలపరచడానికి లేచి నిలబడితే వారు నన్ను ఏదో నేరం చేసినవాడిలా కూర్చోబెడుతున్నారు" అని గొణుక్కుంటూ మస్జిద్ బయటకు వెళ్ళిపోయాడు. మస్జిద్ ద్వారం వద్ద అనుకోకుండా ఓ అన్సారి అతనికి తారసపడి, "నీవు నాశనం అయిపోను! పద, వెనక్కు వెళదాం. బహుశా దైవప్రవక్త (స) నీ మన్నింపు కోసం దుఆ చేస్తారేమో" అని అన్నారు. అతను దానికి, "దైవసాక్షి! ఏమీ వద్దు. ఆయన (స) నా మన్నింపు కోసం ఎలాంటి వేడుకోలు చేయవద్దు" అంటూ వెళ్ళిపోయాడు.[7]

అదే కాదు ఇతను బనూ నజీర్ యూదులతో సంబంధాన్ని స్థాపించు కొని వారితో కలసి ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలూ పన్నాడు.

అలాగే అహ్‌జాబ్ యుద్ధం సందర్భంలో కూడా అబ్దుల్లా బిన్ ఉబై, అతని సహచరులు ముస్లిముల నడుమ భయోత్పాతాన్ని సృష్టించేందుకు, వారి ధైర్యసాహసాలను దెబ్బకొట్టేందుకు రకరకాలుగా ప్రయత్నించి ఉన్నారు. ఆ విషయమే దివ్యఖుర్‌ఆన్‌లోని అల్ అహ్‌జాబ్ సూరాలో ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది:

وَإِذْ يَقُولُ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ مَّا وَعَدَنَا اللَّهُ وَرَسُولُهُ
إِلَّا غُرُورًا ﴿١٢﴾ وَإِذْ قَالَت طَّائِفَةٌ مِّنْهُمْ يَا أَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ فَارْجِعُوا ۚ وَيَسْتَأْذِنُ فَرِيقٌ
مِّنْهُمُ النَّبِيَّ يَقُولُونَ إِنَّ بُيُوتَنَا عَوْرَةٌ وَمَا هِيَ بِعَوْرَةٍ ۖ إِن يُرِيدُونَ إِلَّا فِرَارًا ﴿١٣﴾ وَلَوْ دُخِلَتْ
عَلَيْهِم مِّنْ أَقْطَارِهَا ثُمَّ سُئِلُوا الْفِتْنَةَ لَآتَوْهَا وَمَا تَلَبَّثُوا بِهَا إِلَّا يَسِيرًا ﴿١٤﴾ وَلَقَدْ كَانُوا عَاهَدُوا
اللَّهَ مِن قَبْلُ لَا يُوَلُّونَ الْأَدْبَارَ ۚ وَكَانَ عَهْدُ اللَّهِ مَسْئُولًا ﴿١٥﴾ قُل لَّن يَنفَعَكُمُ الْفِرَارُ إِن فَرَرْتُم مِّنَ
الْمَوْتِ أَوِ الْقَتْلِ وَإِذًا لَّا تُمَتَّعُونَ إِلَّا قَلِيلًا ﴿١٦﴾ قُلْ مَن ذَا الَّذِي يَعْصِمُكُم مِّنَ اللَّهِ إِنْ أَرَادَ بِكُمْ
سُوءًا أَوْ أَرَادَ بِكُمْ رَحْمَةً ۚ وَلَا يَجِدُونَ لَهُم مِّن دُونِ اللَّهِ وَلِيًّا وَلَا نَصِيرًا ﴿١٧﴾ قَدْ يَعْلَمُ اللَّهُ
الْمُعَوِّقِينَ مِنكُمْ وَالْقَائِلِينَ لِإِخْوَانِهِمْ هَلُمَّ إِلَيْنَا ۖ وَلَا يَأْتُونَ الْبَأْسَ إِلَّا قَلِيلًا ﴿١٨﴾ أَشِحَّةً عَلَيْكُمْ ۖ

---

7. ఇబ్నె హష్షామ్-2/105

https://teluguislam.net



فَإِذَا جَآءَ الْخَوْفُ رَأَيْتَهُمْ يَنظُرُونَ إِلَيْكَ تَدُورُ أَعْيُنُهُمْ كَالَّذِي يُغْشَىٰ عَلَيْهِ مِنَ الْمَوْتِ ۖ فَإِذَا
ذَهَبَ الْخَوْفُ سَلَقُوكُم بِأَلْسِنَةٍ حِدَادٍ أَشِحَّةً عَلَى الْخَيْرِ ۚ أُولَٰئِكَ لَمْ يُؤْمِنُوا فَأَحْبَطَ اللَّهُ أَعْمَالَهُمْ ۚ
وَكَانَ ذَٰلِكَ عَلَى اللَّهِ يَسِيرًا ﴿١٩﴾ يَحْسَبُونَ الْأَحْزَابَ لَمْ يَذْهَبُوا ۖ وَإِن يَأْتِ الْأَحْزَابُ يَوَدُّوا لَوْ أَنَّهُم
بَادُونَ فِي الْأَعْرَابِ يَسْأَلُونَ عَنْ أَنبَائِكُمْ ۖ وَلَوْ كَانُوا فِيكُم مَّا قَاتَلُوا إِلَّا قَلِيلًا ﴿٢٠﴾

"కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త (స) మనతో చేసిన వాగ్దానాలన్నీ ఒట్టి భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు వారిలోని ఒక వర్గం "ఓ యస్రిబ్ ప్రజలారా! ఇక మీకు ఇక్కడ ఉండే అవకాశమేదీ లేదు, వెనక్కివెళ్ళిపోండి" అని అన్నది. అప్పుడు వారిలోని మరొక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవ ప్రవక్తకు చెప్పి సెలవుకోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూ లేదు. అసలు వారు (యుద్ధ మైదానం నుండి) పారిపోదలచారు; ఒకవేళ నగరం చుట్టుప్రక్కల నుండి శత్రువులు లోనికి చొరబడి వారిని విద్రోహ చర్యకు పాల్పడమని పిలుపు ఇస్తే, అప్పుడు వారు తప్పకుండా అలా చేస్తారు; విద్రోహ చర్యలో పాల్గొనడానికి వారు చాలా తక్కువగా సంకోచిస్తారు. వారు ఇదివరకు తాము వెన్ను చూపమని అల్లాహ్‌కు వాగ్దానం చేసి ఉన్నారు. అల్లాహ్‌కు చేసిన వాగ్దానం గురించి తప్పకుండా ప్రశ్నించడం జరుగుతుంది.

ఓ ప్రవక్తా! వారితో ఇలా అను, "ఒకవేళ మీరు మృత్యువు బారి నుండి లేదా హత్య బారి నుండి తప్పించుకోవాలని పారిపోతే, ఈ పారిపోవడం మీకు ఏ మాత్రం లాభదాయకం కాబోదు. దీని తరువాత జీవిత సుఖాలను అనుభవించడానికి కొద్దిపాటి అవకాశం మాత్రమే మీకు లభిస్తుంది." వారిని ఇలా అడుగు : "ఒకవేళ అల్లాహ్ మీకు నష్టం కలిగించదలిస్తే, ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలిగే వాడు ఎవడు? ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని కరుణించ దలిస్తే, ఆయన కరుణను ఆపగలిగే వాడు ఎవడు? అల్లాహ్‌కు ప్రతిగా వారు ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు."

మీలో (యుద్ధకార్యంలో) ప్రతిబంధకాలు సృష్టించే వారినీ, తమ సోదరులను "మా వైపునకు రండి" అని పిలిచేవారినీ, లెక్కకు మాత్రమే యుద్ధంలో పాల్గొనే వారినీ, నీకు తోడ్పడే విషయంలో పరమ లోభులైన వారినీ

https://teluguislam.net



అల్లాహ్ బాగా ఎరుగును. మరణ సమయంలో అపస్మారక స్థితికి గురి అయిన వారి వలె వారు ప్రమాదం సంభవించినప్పుడు గుడ్లు తిప్పుతూ నీ వైపు చూస్తారు. కాని ప్రమాదం తొలగిపోగానే, వారే లాభాలను పొందాలని దురాశా పరులై కత్తెరల వలె ఆడే నాలుకలతో నీకు స్వాగతం చెప్పడానికి వస్తారు. వారు ఏ మాత్రం విశ్వసించినవారు కారు. కనుకనే అల్లాహ్ వారి కర్మలను అన్నిం టినీ నిరర్థకం చేశాడు. అల్లాహ్‌కు అలా చేయడం చాలా సులభం. దాడి చేసిన వర్గాలు ఇంకా వెళ్ళిపోలేదు అనేవారు భావిస్తున్నారు, ఒకవేళ ఆ వర్గాలు మళ్ళీ దాడి చేస్తే, ఎడారిలో ఎక్కడికైనా పోయి పల్లెల్లో అరబ్బుల మధ్య కూర్చుందామనీ, అక్కడ నుండే మీ పరిస్థితులను గురించి తెలుసుకుందామనీ వారి మనస్సు కోరుతోంది. ఒకవేళ వారు మీ మధ్య ఉన్నా, యుద్ధంలో చాలా తక్కువగానే పాల్గొంటారు." (33 : 12-20)

పై ఖుర్‌ఆన్ వాక్యాలలో సందర్భాన్నిబట్టి, మునాఫిక్‌ల భావోద్రేకాలు, వారి వైఖరి, వారి మానసిక పరిస్థితి, స్వార్థం, అవకాశవాదానికి సంబంధించిన ఓ విస్పష్ట చిత్రం మన ముందు ఉంచుతోంది.

దీనికి తోడు యూదులకు, మునాఫిక్‌లకు, బహుదైవారాధకులకు మాత్రమే కాదు ఇస్లామ్ విరోధి మూకలన్నిటికీ, ఇస్లామ్ ప్రాబల్యానికి కారణం, భౌతిక ఆధిక్యత, ఆయుధ సంపత్తి, సైనికబలం మాత్రమే కాదనీ, ఈ ప్రాబల్యానికి గల ప్రధాన కారణం ముస్లిములలో నెలకొని ఉన్న నైతిక సుగుణాలే అన్న విషయం తెలిసివచ్చింది. ఈ నైతిక సుగుణాలు ఆనాటి ఇస్లామీయ సమాజంలో మరియు ఇస్లామ్ ధర్మంతో ఏ మాత్రం సంబంధం కలిగి ఉన్న ప్రతి వ్యక్తిలోనూ ప్రస్ఫుటంగా అగుపించేవి. ఇంకా ఈ ఇస్లామ్ విరోధి మూకలకు, శుభాల సరోవరమైన దైవప్రవక్త (స) గారి వ్యక్తిత్వమే అన్న విషయమూ ఆ నైతిక సుగుణాలు ఆయన (స)లో మహత్మ్యాల కంటే ఉన్నతమైనవిగా ఉన్నాయన్న విషయమూ తెలిసి ఉండడమే.

అలాగే, ఇస్లామ్ ధర్మవిరోధులు అయిదు సంవత్సరాల వరకు ఆయనతో యుద్ధం చేస్తూ, ఈ ధర్మానుయాయుల్ని ఆయుధ బలంతో లోబరుచుకోవడం లేదా వారిని నామరూపాల్లేకుండా చేయడం దుస్సాధ్యం అన్న విషయాన్ని గ్రహించే ఉన్నారు. అందుకని వారు, బహుశా నైతిక కోణంతో

https://teluguislam.net



ఆ ధర్మానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచార యుద్ధాన్ని ప్రారంభిం చాలను కున్నారు. మొట్టమొదటగా దైవప్రవక్త (స) గారి వ్యక్తిత్వంపై గురిపెట్టి ఆ ప్రచారాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. మునాఫిక్‌లు ముస్లిము లలో అయిదో వర్గం. వీరు మదీనాలోనే ఉంటూ ఉన్నారు. ముస్లిములతో ఎలాంటి అరమరికలు లేకుండా కలసిపోయినవారు. వారి భావోద్రేకాలను కూడా సమయాన్నిబట్టి సునాయాసంగా రెచ్చగొట్టనూగలరు. కాబట్టి ఈ దుష్ప్రచార బాధ్యతను తమ నెత్తినేసుకున్నారు ఈ మునాఫిక్‌లు. అబ్దుల్లా బిన్ ఉబై దీనికి నాయకత్వం వహించాడు.

వారి ఈ ప్రణాళిక వెలుగుజూసింది ఎప్పుడంటే, జైద్ బిన్ హారిసా (ర) తన భార్య జైనబ్ (ర)కు విడాకులు ఇచ్చి ఆమెను దైవప్రవక్త (స)కు ఇచ్చి వివాహం చేసినప్పుడు. అరేబియా సంప్రదాయం ప్రకారం, వారు ముతబన్నా (పెంపుడు కుమారుడు)కు తమ సొంత కుమారుని హోదా కల్పిస్తూ ఉండే వారు. అతని భార్యను సొంత కుమారుని భార్యగా నిషిద్ధం అని అనుకునే వారు. అందుకని దైవప్రవక్త (స), హజ్రత్ జైనబ్ (ర)ను వివాహమాడగానే మునాఫిక్‌లకు దైవప్రవక్త (స) గారికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడానికి మంచి అవకాశం లభించింది. వారి దృష్టిలో వారికి రెండు బలహీన అవకా శాలు చేతచిక్కాయని అనుకోవడం జరిగింది.

హజ్రత్ జైనబ్ (ర) దైవప్రవక్త (స) గారి అయిదవ సతీమణి. దివ్య ఖుర్ఆన్ నలుగురి కంటే ఎక్కువ మందిని ఏక కాలంలో భార్యలుగా ఉంచడానికి అనుమతి ఇవ్వలేదు. కాబట్టి ఈ వివాహం సక్రమమైన వివాహం ఎలా అవుతుంది? అన్నది ఒకటి.

రెండవది, హజ్రత్ జైనబ్ (ర) ఆయన కుమారుని - అంటే పెంపుడు కుమారుని - భార్య. కాబట్టి అరేబియా సంప్రదాయం ప్రకారం, ఆమెను వివాహమాడడం ఓ పెద్ద నేరం మరియు తీవ్రమైన పాపం కూడా. కాబట్టి ఈ విషయంలోనూ బాగా ప్రాపగాండా చేయడం జరిగింది. రకరకాల కట్టుకథలు అల్లడమూ జరిగింది. దుష్ప్రచారం చేసేవారు ఈ కట్టుకథల్లో, ముహమ్మద్ (స) హజ్రత్ జైనబ్ (ర)ను చూడగానే ప్రేమలో పడిపోయారనీ, ఈ విషయం ఆయన కుమారునికి తెలియగానే ఆయన దైవప్రవక్త (స) కోసం మార్గాన్ని సుగమం చేయడానికి ఆమెకు విడాకులిచ్చారని కూడా చెప్పడం జరిగింది.

https://teluguislam.net



మునాఫిక్‌లు అల్లిన ఈ కట్టుకథలను ఎంత విస్తృతంగా ప్రచారం చేశారో ఆ విషయాలు ఇప్పటి వరకూ హదీసు గ్రంథాల్లో, ఖుర్‌ఆన్ వ్యాఖ్యా నాల్లో కానవస్తాయి. ఆ కాలంలో ఈ ప్రాపగాండాకు బలహీనులు, అమాయ కులూ అయిన ముస్లిములు బాగా ప్రభావితం అయినందునే, ఈ విషయానికి సంబంధించి అల్లాహ్ దీన్ని ఖండించడానికి దివ్యవాణిని అవతరింపజేశాడు. ఆ ఆయత్‌లలో వీరి అనుమానాలకు సంబంధించి వారి హృదయాల్లో చోటుచేసుకున్న వ్యాధికి సంబంధించిన పూర్తి చికిత్స ఉంది. ఈ ప్రాపగాండ ఎంత పెద్ద ఎత్తున చేబట్టడం జరిగిందో, దాని తీవ్రతను గ్రహిం చేందుకు, దాని ఖండన కోసం అహ్‌జాబ్ సూరా (అధ్యాయం) ఈ క్రింది వాక్యాలతోనే ప్రారంభం అయింది అన్నది గ్రహించవచ్చు.

يَٰٓأَيُّهَا ٱلنَّبِىُّ ٱتَّقِ ٱللَّهَ وَلَا تُطِعِ ٱلْكَٰفِرِينَ وَٱلْمُنَٰفِقِينَ ۗ إِنَّ ٱللَّهَ كَانَ عَلِيمًا حَكِيمًا ①

"ఓ ప్రవక్తా! అల్లాహ్‌కు భయపడు. అవిశ్వాసులకూ, కపటులకూ విధేయత చూపకు. వాస్తవానికి అల్లాహ్‌యే జ్ఞాని మరియు వివేకి." (33:1)

మునాఫిక్‌ల దుష్ప్రచారాన్నీ, వారి వైఖరినీ వ్రేలెత్తి చూపుతున్న సమగ్ర చిత్రమే ఈ వాక్యాలు. మహాప్రవక్త (స) ఈ కపటులు అవలంబిస్తున్న ఈ వైఖరిని ఎంతో సహనంతో, సంయమనంతో భరిస్తూనే ఉన్నారు. అటు ముస్లి ములు కూడా ఈ దుష్ప్రచారానికి ప్రభావితులు కాకుండా సహనం వహిస్తు న్నారు. దైవం తరఫు నుండి అప్పుడప్పుడు మునాఫిక్‌లు అగౌరవం పాలు అవుతున్న అనుభవం వారికి ఉంది కనుక. ఈ విషయంలో ఈ క్రింది ఆయత్‌లు అవతరించాయి.

أَوَلَا يَرَوْنَ أَنَّهُمْ يُفْتَنُونَ فِى كُلِّ عَامٍ مَّرَّةً أَوْ مَرَّتَيْنِ
ثُمَّ لَا يَتُوبُونَ وَلَا هُمْ يَذَّكَّرُونَ ⑫⑥

"తాము ప్రతి సంవత్సరం ఒకటి రెండు సార్లు పరీక్షకు గురిచేయబడటాన్ని వారు చూడడం లేదా? కాని దీని తరువాత కూడా వారు పశ్చాత్తాపము పడటంలేదు. ఏ గుణపాఠాన్నీ నేర్చుకోవటంలేదు." (9 : 126)

https://teluguislam.net



## గజ్వయె బనూ ముస్తలిక్‌లో మునాఫిక్‌ల పాత్ర

గజ్వయె బనీ ముస్తలిక్ జరిగినప్పుడు మునాఫిక్‌లు కూడా ఆ పోరాటంలో దైవప్రవక్త (స)తో వెళ్ళడం జరిగింది. వారు అల్లాహ్ తన గ్రంథంలో ఈ క్రింద చెప్పిన విధంగానే ప్రవర్తించారు:

لَوْ خَرَجُوا فِيكُمْ مَّا زَادُوكُمْ إِلَّا خَبَالًا وَّلَا أَوْضَعُوا خِلَالَكُمْ يَبْغُونَكُمُ الْفِتْنَةَ

"వారు గనక మీతో బయలుదేరి ఉండి ఉన్నట్లయితే, మీకు కీడు తప్ప మరి దేనినీ అధికం చేసి ఉండేవారు కాదు. వారు మీ మధ్య విభేదాల్ని సృష్టించే నిమిత్తం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉంటారు." (9 : 47)

కాబట్టి ఈ పోరాటంలో వారికి రెండు అవకాశాలు లభించాయి. వాటిని ఆసరాగా తీసుకొని ముస్లిములలో విభేదాలు, వైషమ్యాలు సృష్టించి దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా నీచమైన దుష్ప్రచారం చేశారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించిన వివరాలు కొన్ని ఇక్కడ చెబుతున్నాము.

## 1. మదీనా నుండి అతి నీచుడైన వ్యక్తిని గెంటివేసే విషయం

గజ్వయె బనీ ముస్తలిక్‌ను ముగించుకొని మహాప్రవక్త (స), ముర్‌యసీ ఊట బావి వద్దకు వచ్చి విడిది చేశారో లేదో, అక్కడకు కొంత మంది నీళ్ళు తెచ్చుకోడానికి వెళ్ళడం జరిగింది. వెళ్ళిన వారిలో హజ్రత్ ఉమర్ (ర) గారికి చెందిన ఓ కూలీవాడు కూడా ఉన్నాడు. అతని పేరు 'జహ్‌జాహ్ గిఫ్ఫారి.' అక్కడ అతనికి, మరో వ్యక్తి 'సనాన్ వబర్ జుహ్నీ'కి నడుమ తోపులాట జరిగింది. వారిద్దరూ కొట్టుకున్నారు కూడా. అంతలోనే జుహ్నీ, "ఓ అన్సారు ప్రజలారా! సహాయానికి రండి" అని పిలిచాడు అన్సారులను. ఇటు జహ్‌జాహ్ కూడా తమ జాతి ప్రజల్ని, "ఓ ముహాజిర్‌లారా! సహాయానికి రండి" అని పిలిచాడు. దైవప్రవక్త (స)కు ఈ వార్త అందగానే అక్కడికి వెళ్ళి, "ఇంకా నేను మీలో ఉండగానే ఈ అజ్ఞానపు పిలుపులా? ఈ వైఖరిని వదలండి, ఇది ఎంతో హేయమైన విషయం" అని చెప్పగా వారందరూ వెళ్ళిపోయారు.

ఈ వార్త అబ్దుల్లా బిన్ ఉబై చెవిన కూడా పడింది. అతను కోపంతో, "వారు ఇలా చేశారా? వీరు మన ప్రాంతానికి వచ్చి మనకే ఎదురు తిరుగు

https://teluguislam.net



తున్నారా? దైవసాక్షి! మనం మన కుక్కను బాగా బలిసినట్లు పెంచితే అది మనల్నే పీక్కుతిన్నట్లుగా ఉంది. మన పూర్వీకులు చెప్పిన సామెత మనపై పూర్తిగా నిజం చేశారు వారు. వినండి! మనం మదీనాకు తిరిగి వెళ్ళాక మన లోని అతి గౌరవనీయుడు మనలోని అతి నీచమైన వ్యక్తిని మదీనా నుండి వెళ్ళగొడతాడు" అంటూ అక్కడున్న వారిని ఉద్దేశించి, "ఈ పీడను స్వయంగా మీరే కొనుక్కున్నారు, వీరిని తీసుకొచ్చి మీ నగరంలో చోటిచ్చారు, మీ ఆస్తుల్ని పంచిపెట్టారు. చూడండి! ఇప్పుడు మీ దగ్గర ఉన్నది వారికి ఇవ్వడం మానేస్తే, వీరు మీ నగరాన్ని వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోతారు" అని రెచ్చగొట్ట నారంభించాడు.

ఆ సమయాన అక్కడ ఓ యువ సహాబీ హజ్రత్ జైద్ బిన్ అర్కమ్ కూడా ఉన్నారు. ఆయన వచ్చి ఈ విషయాన్ని తన పినతండ్రికి వివరించారు. ఆయన పినతండ్రి దైవప్రవక్త (స) గారికి ఈ వృత్తాంతాన్ని వివరించారు. హజ్రత్ ఉమర్ (ర) ఇది విని, "దైవప్రవక్తా! అబ్బాద్ బిన్ బిష్రకు ఆదేశం ఇవ్వండి, అతణ్ణి వధించమని" అన్నారు.

"ఉమర్! ఇదెలా సాధ్యం? ప్రజలంతా, ముహమ్మద్ తన సహచరుల్ని వధిస్తున్నాడని చెప్పుకోరా? లేదు! ఇప్పుడే బయలుదేరే ప్రకటన చేయండి" అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) ఆ సమయాన ఎప్పుడూ బయలుదేరి ఉండలేదు. సహచరులంతా బయలుదేరగా చూసి హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్(ర) దైవప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి, "ఏమిటీ దైవప్రవక్తా! తమరు ఈ రోజు ఎటూ కాని వేళలో బయలుదేరమని ఆదేశమిచ్చారు?" అని అడిగారు.

"ఏమిటీ? మీ మనిషి (అంటే అబ్దుల్లా బిన్ ఉబై) చెప్పింది నీకు తెలియదా?" అడిగారు దైవప్రవక్త(స).

"అతనేమన్నాడు?" ప్రశ్నించారు ఉసైద్ (ర).

"అతను మదీనాకు వెళ్ళగానే అతి గౌరవనీయుడు అతి నీచమైన వ్యక్తిని మదీనా నుండి గెంటివేస్తాడట."

"దైవప్రవక్తా! తమరే అనుకుంటే అతణ్ణి మదీనా నుండి గెంటివేయ గలరు. దైవసాక్షి! అతను ఎంతో నీచమైనవాడు. తమరు అతి గౌరవనీయులు.

https://teluguislam.net



దైవప్రవక్తా! అతని ఎడల కొంత మెత్తగా వ్యవహరించండి. ఎందుకంటే, దైవసాక్షి! అల్లాహ్ తమరిని మా వద్దకు తీసుకువచ్చినప్పుడు మా జాతి అతణ్ణి కిరీటధారునిగా చేయడానికి పగడాల కిరీటం తయారు చేయిస్తోంది. కాబట్టి అతను ఇప్పుడు, తమరు అతని రాజ్యాధికారాన్ని లాక్కున్నారని తలుస్తున్నాడు" అన్నారు.

దైవప్రవక్త (స) ప్రొద్దుక్రుంకే వరకు రోజంతా, ఉదయం అయ్యే వరకు రాత్రంతా అలా ప్రయాణిస్తూనే ఉన్నారు. మరీ చెప్పాలంటే, బాగా ప్రొద్దెక్కే వరకు తమ ప్రయాణాన్ని సాగిస్తూనే ఉన్నారు అనవచ్చు. బాగా ప్రొద్దెక్కి ఎండ వేడిమి అధికమైనప్పుడు ఓ చోట విడిది చేశారు. అలసి ఉండడం వల్ల ఆదమరిచి నిద్రపోయారందరూ. దైవప్రవక్త (స) గారి ధ్యేయం కూడా అదే. తమ వెంట ఉన్న వారు అలా అలసిపోయి ఉండకపోతే పిచ్చాపాటి మాట్లాడు కునే అవకాశం లభిస్తుంది మరి.

ఇటు జైద్ బిన్ అర్కమ్ (ర) తన ప్రేలాపనలన్నింటినీ దైవప్రవక్త (స)కు వినిపించిన విషయం అబ్దుల్లా బిన్ ఉబైకు తెలిసిపోయింది. అతను ఆయన (స) గారి సన్నిధిలో హాజరై అల్లాహ్‌పై ఒట్టేసుకుని, అర్కమ్ ఏదైతే చెప్పారో తాను అనలేదని బొంకనారంభించాడు. అక్కడ అన్సారులకు చెందిన కొందరు వ్యక్తులూ ఉన్నారు. వారు కూడా మహాప్రవక్త(స)తో, "ఓ ప్రవక్తా! జైద్ బిన్ అర్కమ్ ఉత్త తగువుల మారి. అతని మాట నమ్మకండి, బహుశా అతను తప్పుగా అర్థం చేసుకొని ఉంటారు. ఇతను చెప్పినదాన్ని సరిగా గుర్తుంచుకోలేదేమో" అని వంతపాడనారంభించారు. కాబట్టి దైవప్రవక్త (స) అబ్దుల్లా బిన్ ఉబై నిజం చెబుతున్నాడని అనుకొని అతని మాటను నమ్మారు. ఈ విషయం జైద్ బిన్ అర్కమ్ (ర) కు తెలిసింది. ఆయన మాటల్లోనే, "నాకు అప్పుడు కలిగిన మనస్తాపం ఏనాడూ కలుగలేదు. నేను ఆ బాధతో నా ఇంటనే కూర్చుని ఉండిపోయాను. అల్లాహ్ సూరయె మునాఫికీన్‌లో అవతరింప జేసిన ఆయత్‌లో ఈ విషయమే ప్రస్తావించనంత వరకు నేను ఎటూ కదల లేదు" అని అన్నారు. ఆ ఆయత్‌లో ఈ రెండు విషయాలు ఉన్నాయి.

هُمُ الَّذِيْنَ يَقُوْلُوْنَ لَا تُنْفِقُوْا عَلٰى مَنْ عِنْدَ

https://teluguislam.net



رَسُوْلِ اللّٰهِ حَتّٰى يَنْفَضُّوْا ؕ

"వారే ఇలా అనేది, "ప్రవక్త అనుచరుల కోసం ఖర్చుపెట్టడం ఆపేయండి. అప్పుడు వారు చెల్లాచెదరైపోతారు." (63 : 7)

يَقُوْلُوْنَ لَئِنْ رَّجَعْنَآ اِلَى الْمَدِيْنَةِ لَيُخْرِجَنَّ الْاَعَزُّ مِنْهَا الْاَذَلَّ ؕ

"వారు ఇంకా ఇలా అంటారు: "మనం మదీనా నగరానికి తిరిగివెళ్ళిన తరువాత మనలోని గౌరవనీయులను, నీచులను అక్కణ్ణుంచి వెళ్ళగొట్టాలి." (63 : 9)

హజ్రత్ జైద్ (ర) ఇలా అంటారు: "ఆ వాక్యాలు అవతరించిన తరువాత దైవప్రవక్త (స) నన్ను పిలిపించి వాటిని చదివి వినిపించారు. ఆ తరువాత ఆయన (స), (జైద్!) అల్లాహ్ నిన్ను ధృవపరిచాడు" అని చెప్పారు.[8]

ఈ మునాఫిక్ కుమారుడు అబ్దుల్లా (ర) అతనికి భిన్నమైన వ్యక్తిత్వం గలవారు. ఆయన ఓ మంచి సహచరుడు కూడాను. ఆయన తన తండ్రి మాటలను ఖండిస్తూ మదీనా ప్రవేశ ద్వారం వద్ద కత్తి దూసి నిలబడ్డారు, ఆయన తండ్రి అబ్దుల్లా బిన్ ఉబై అక్కడికి చేరగానే అతనిని అడ్డుకుంటూ, "దైవసాక్షి! మీరు ఇక్కడ నుండి ముందుకు వెళ్ళడానికి వీల్లేదు. దైవప్రవక్త (స) అనుమతిస్తే తప్ప, ఎందుకంటే దైవప్రవక్తే అందరికంటే గౌరవనీయులు. మీరే అందరికంటే నీచులు" అని నిలదీశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడకు చేరగానే అతణ్ణి మదీనాలోనికి ప్రవేశించే అనుమతి ఇచ్చారు. అప్పుడుగాని అతని కుమారుడు అతని మార్గానికి అడ్డుతొలగలేదు. ఆ సందర్భంలోనే అబ్దుల్లా బిన్ ఉబై కుమారుడు అబ్దుల్లాహ్ (ర) దైవప్రవక్తతో, "దైవప్రవక్తా! తమరే అతణ్ణి హతమార్చదలుచుకుంటే నాకు ఆదేశం ఇవ్వండి. దైవసాక్షి! నేను ఆయన తలను నరికి మీ కాళ్ళ దగ్గర పడవేస్తాను" అని విన్నవించుకోవడం కూడా జరిగింది.[9]

## 2. ఇఫ్క్ సంఘటన

ఈ గజ్వాకు సంబంధించిన మరో ముఖ్య సంఘటన 'ఇఫ్క్' సంఘటన. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటంటే,

8. చూడండి, సహీ బుఖారి-1/499, 2/227, 228, 229; ఇబ్నె హిషామ్-2/290, 291, 292
9. ఇబ్నె హిషామ్-1/499, 2/227, 228, 229; ముఖ్తసరుస్సీరత్ -షేక్ అబ్దుల్లాహ్-పుట. 277

https://teluguislam.net



దైవప్రవక్త (స) ప్రయాణానికి బయలుదేరే ముందు తమతోపాటు ఏ సతీమణిని తీసుకు వెళ్ళాలి అని చీటి వేసి ఎవరి పేరు వస్తే వారిని తమ వెంట తీసుకువెళ్ళడం రివాజు. ఈ గజ్వాలో కూడా అలా చీటి వేయడం జరిగింది. అందు హజ్రత్ ఆయిషా (ర) గారి పేరు రావడం వలన ఆమెను తమ వెంట తీసుకువెళ్ళారు. తిరుగు ప్రయాణంలో ఓ చోట విడిది చేసినప్పుడు హజ్రత్ ఆయిషా (ర) బహిర్భూమికని వెళ్ళడం జరిగింది. ఆమె వెళ్ళేటప్పుడు తన సోదరి వద్ద నుండి అడిగి ధరించిన కంఠహారం అక్కడ పడిపోయింది. అది తెలియగానే తిరిగి అదే ప్రదేశానికి వెళ్ళి వెదకనారంభించారు. ఈలోపు బయలుదేరే ఆదేశం అందగానే, అంబారీని ఒంటెపై ఎత్తిపెట్టేవారు వచ్చి అంబారీనీ ఎత్తి ఒంటెపైకి ఎక్కించారు. వారు హజ్రత్ ఆయిషా (ర) అందులోనే ఉన్నారని తలచడం జరిగింది. అంబారీ తేలికగా ఉండటాన్ని వారు పట్టించుకోలేదు. ఎందుకంటే హజ్రత్ ఆయిషా (ర) గారి వయస్సు పిన్న వయస్సు. శరీరం ఏమంత బరువుగా కూడా లేదు. అదే కాకుండా ఆ అంబారీని చాలా మంది పట్టి పైకి ఎక్కించడం మూలంగా ఈ విషయం వారికి అర్థం కాలేదు. ఒకరు ఇద్దరు ఎత్తితే బహుశా బరువు గురించి అనుమానం వచ్చి ఉండేదేమో.

ఎలాగయితేనేమీ, హజ్రత్ ఆయిషా (ర) తన హారాన్ని వెదికి దాన్ని తీసు కొని విడిదికి వచ్చి చూడగా సేన మొత్తం వెళ్ళిపోయి ఆ ప్రదేశం ఖాళీగా ఉంది. పిలిచేవారుగాని, పిలుపుకు సమాధానం పలికేవారుగాని ఎవ్వరూ అక్కడ లేరు. అందుకని ఆమె, తాను సేన వెంట లేననే విషయం తెలుసు కొని ఎవరైనా తిరిగి రాకమానరనే ఉద్దేశ్యంతో అక్కణ్ణే కూర్చుండిపోయారు. అయితే అల్లాహ్ ఏది తలిస్తే అది అయితీరుతుంది. ఆయన ఆకాశం నుంచి ఏ ఆదేశం ఇస్తాడో అదే అమలు జరుగుతుంది. కాబట్టి అలా కొద్దిసేపు కూర్చోగా ఆమెకు కన్ను మలిగింది. అంతే ఆమె నిద్ర ఒడిలోకి జారిపోయారు. ఆ తరువాత హజ్రత్ సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ (ర) గారి పిలుపును విని నిద్ర నుండి మేల్కొన్నారు. ఆయన ఆమెను చూడగానే "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" అని పఠిస్తూ అయ్యో! ఈమెగారు దైవప్రవక్త (స) గారి సతీమణి...! అని ఆశ్చర్యాన్ని ప్రకటించారు. హజ్రత్ సుఫ్వాన్ సైన్యం వెనుకగా నిద్రపోయినవారు. ఆయన అలవాటు బాగా నిద్రించే అలవాటు. ఆయన ముస్లిముల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (ర)ను చూసి గుర్తుపట్టారు. ఎందు

https://teluguislam.net



కంటే పరదా ఆదేశం వెలువడక పూర్వం ఆయన ఆమెను చూసి ఉన్నారు. ఆయన ఇన్నాలిల్లాహ్ తప్ప తన నోట మరే పలుకూ పలకలేదు. తన వాహనాన్ని ఆమెకు దాపుగా కూర్చోబెట్టగా ఆమె దానిపై ఎక్కి కూర్చున్నారు. ఒంటె ముకుత్రాడు పట్టుకొని కాలి నడకన నడుస్తూ సైన్యం వెళ్ళిన దిశగా బయలు దేరారు. మిట్టమధ్యాహ్న సమయాన సైన్యం ఓ చోట విడిది చేసి ఉంది. ఆయన ఆ పరిస్థితిలో సైన్యంలోనికి వచ్చేశారు. చూసేవారు రకరకా లుగా చెప్పుకోవడం ఆరంభించారు. దైవ విరోధి అబ్దుల్లా బిన్ ఉబైకు కూడా తన కక్షను తీర్చుకోవడానికి అవకాశం లభించినట్లయింది. అతని హృదయంలో కాపట్యం, ఈర్ష్యాజ్వాలలు ఏవయితే రగులుతున్నాయో, ఆ బాధను బయటపెట్టడానికి అతను ముందుకు వచ్చాడు. ముస్లిముల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (ర)పై అపవాదు వేస్తూ కట్టుకథలు అల్లడం ఆరంభించాడు. ఆ అపవాదును ప్రజల్లో వ్యాపింపజేయడానికి శాయశక్తులా ప్రయత్నాలు మొదలెట్టాడు. అతని అనుచరులు కూడా ఈ విషయాన్ని ప్రాతిపదికగా చేసి సాధ్యమైనంత దుష్ప్రచారం చేయనారంభించారు. అటు మహాప్రవక్త (స) ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు.

కాని ఓ సుదీర్ఘ కాలం వరకు దైవవాణి అవతరించకపోవడంతో, ఆయన హజ్రత్ ఆయిషా (ర)కు దూరంగా ఉండి పోయే విషయంలో తన అనుచరులతో సంప్రదిం చాల్సివచ్చింది. హజ్రత్ అలీ (ర), వివరాలు నోటితో చెప్పే బదులు సైగలతోనే, ఆమెకు దూరంగా ఉంటూనే మరొకరిని వివాహ మాడమని సలహా ఇచ్చారు. కాని హజ్రత్ ఉసామా (ర) వగైరా సహాబాలు మాత్రం, ఆమెను తన భార్యగానే ఉంచుకుని వేచి చూడండి, దైవవిరోధుల దుష్ప్రచారాలకు చెవులొగ్గవద్దని సలహా ఇచ్చారు. ఆ తరువాత మహాప్రవక్త (స) మెంబరు (ప్రసంగ వేదిక)పై నిలబడి, అబ్దుల్లా బిన్ ఉబై ఆగడాల నుండి తనను రక్షించమని సహచరు లకు చెప్పడం జరిగింది. అది విన్న హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), అతణ్ణి హతమార్చమని మహాప్రవక్త (స)కు సలహా ఇచ్చారు. అయితే, అబ్దుల్లా బిన్ ఉబై తెగ ఖజ్రజ్‌కు సర్దారు అయిన హజ్రత్ సఅద్ బిన్ ఉబాదాకు ఈ మాటలు రుచించలేదు. ఆయనకు తెగ దురభిమానం పొడుచుకు వచ్చింది. ఇరువైపుల నుండి కఠిన పదజాలాలు వెలువడనారంభించాయి. దీని ఫలితంగా అవస్ మరియు ఖజ్రజ్ తెగలు

https://teluguislam.net



తిరిగి ఉగ్రులయ్యారు. మహాప్రవక్త (స) ఆ రెండు తెగలను ఎంతో కష్టపడి శాంతపరచగలిగారు. దైవప్రవక్త (స) కూడా ఆ విషయాన్ని గూర్చి మరి మాట్లాడలేదు.

ఇటు హజ్రత్ ఆయిషా (ర) గారి పరిస్థితి ఎలాగుందంటే, ఆమె ఆ గజ్వా నుండి తిరిగి రాగానే వ్యాధికి గురై మంచానపడ్డారు. అలా పూర్తి ఒక నెల వరకు వ్యాధిలోనే ఉండిపోయారు. ఆమెకు ఈ అపవాదు గురించి ఏ మాత్రం తెలియదు. అయితే ఆమెకు మాత్రం దైవప్రవక్త (స) వ్యాధి సమయంలో చేసే పరామర్శ గురించి బాగా తెలుసు. ఆయన మాటిమాటికి పరామర్శిం చడానికి వచ్చేవారు. కాని ఇప్పుడు ఒక నెల అయిపోయినా తన వైపు చూడ నైనా చూడడంలేదు. ఇదే ఆమె మనస్సును తొలుస్తున్న ప్రశ్న. వ్యాధి నయమై పోయిన తరువాత ఆమె 'ఉమ్మె మస్తహ్' వెంట బహిర్భూమి కని బయలు ప్రదేశానికి వెళ్ళారు. అనుకోకుండా ఉమ్మె మస్తహ్ తాను కప్పుకున్న దుప్పటి కాళ్ళలో పడగా పడిపోయారు. అలా పడిపోయిన తరువాత ఆమె తన కుమారుడు మస్తహ్‌ను శపించారు. అలా ఆమె తన కుమారునికి శాపనార్థాలు పెడుతూ ఉండగా చూసి హజ్రత్ ఆయిషా (ర) ఆమెను మందలించడం జరిగింది. ఉమ్మె మస్తహ్, హజ్రత్ ఆయిషా (ర)కు, తన కుమారుడు అపవాదులు వేసేవారిలో ఒకడని చెప్పడానికిగాను అసలు విషయం అంతా చెప్పెయ్యడం జరిగింది. హజ్రత్ ఆయిషా (ర) తిరిగి వచ్చి అసలు విషయాన్ని తెలుసుకోవడానికి గాను దైవప్రవక్త (స)గారి అనుమతి తీసుకొని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోయారు. అసలు విషయం పూర్తిగా తెలియగానే ఆమెకు దుఃఖం ఆగలేదు. అలా రెండు రాత్రులు, ఒక పగలు ఏడుస్తూనే గడిపివేశారు. ఈలోపు నిద్రాహారాలు మానేశారు. అలా ఏడుస్తూ గుండె పగిలి చనిపోతానేమో అని కూడా అనుకున్నారామె. ఈ పరిస్థితిలోనే దైవప్రవక్త (స) ఆమె వద్దకు అరుదెంచారు. సద్వచనంతో కూడిన ఖుత్బా చదివి, ఆమెతో, "ఓ ఆయిషా! నాకు నీ గురించి ఫలానా విధంగా జరిగిందని తెలిసింది. నీవే గనక దాని గురించి ఏమీ తెలియదు అని చెబితే, అల్లాహ్ త్వరలోనే నీ నిర్దోషిత్వాన్ని చాటుతాడు. ఒకవేళ నీవే గనక దానికి ఒడిగట్టి ఉంటే మాత్రం అల్లాహ్ మన్నింపు కోసం వేడుకో. తౌబా చెయ్యి. ఎందుకంటే దాసుడు తన పాపాలను ఒప్పుకొని దైవం ఎదుట పశ్చాత్తాపపడితే, అల్లాహ్ ఆ దాసుని తౌబా మన్నించి క్షమిస్తాడు" అన్నారు.

https://teluguislam.net



ఆ మాటలు వినగానే హజ్రత్ ఆయిషా (ర) గారి ఏడుపు ఆగిపోయింది. కన్నీళ్ళు మటుమాయమయ్యాయి. ఆమె తన తల్లిదండ్రులతో దైవప్రవక్త (స)కు సమాధానం ఇవ్వండి అని చెప్పారు. అయితే ఏమని సమాధానం ఇవ్వాలో వారికి తోచలేదు. అందుకని ఆమెయే స్వయంగా కల్పించుకొని, "దైవసాక్షి! నాకు తెలుసు. ఈ విషయాన్ని వినీ వినీ అది మీ హృదయాల్లో ముద్రించుకుపోయిందని. మీరంతా దీన్ని నిజం అని అనుకుంటున్నారు. కాబట్టి ఒకవేళ నేను ఇది తప్పు అని, నాకు దానితో ఏ సంబంధం లేదని చెప్పినా మీరు నమ్మరు- అల్లాహ్‌కు బాగా తెలుసు, నేను నిర్దోషినని- ఒకవేళ నేను దీన్ని ఒప్పుకుంటే - అల్లాహ్‌కు బాగా తెలుసు, నేను నిర్దోషినన్న విషయం - మీరు అది నిజమే అని అనుకుంటారు. ఇలాంటి పరిస్థితిలో, నాకూ మీకు నడుమగల విషయం అచ్చం హజ్రత్ యూసుఫ్ (అ.స.) గారి తండ్రి చెప్పిన విషయం, "సహనమే మేలైనది. మీరు చెప్పే విషయాలను గురించి నాకు అల్లాహ్ సహాయం ఒక్కటే చాలు అన్నట్లు ఉంటుంది" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ ఆయిషా (ర) మరో ప్రక్కకు తిరిగి పడుకున్నారు. ఆ సమయంలోనే దైవప్రవక్త (స) పై దివ్యావిష్కృతి అవతరింపనారంభించింది. దివ్యవాణి అవతరణ కఠినత్వం పూర్తిగా తొలగిపోయిన తరువాత మహాప్రవక్త (స) చిరునవ్వునవ్వుతూ ఉన్నారు. ఆయన మొట్టమొదటగా తన నోటి నుంచి పలికిన పదం, "ఓ ఆయిషా! అల్లాహ్ నీవు నిర్దోషివి అని చాటాడు" అన్నదే. ఇది విన్న ఆమె గారి తల్లి (సంతోషం పట్టలేక) "ఆయిషా! ప్రవక్త (స) వైపునకు కదిలివెళ్ళు. ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకో" అనగా, ఆమె ప్రేమాతిశయం ఉట్టిపడుతూ కొంత బింకంగా, "దైవసాక్షి! నేనెందుకు వెళ్ళాలి. నేను అల్లాహ్‌నే స్తుతిస్తాను" అన్నారు.

ఈ సందర్భంలో ఇఫ్క్ సంఘటనకు సంబంధించిన ఏ వాక్యాలు అయితే నూర్ సూరాలో అవతరించాయో అవి

فَصَبْرٌ جَمِيلٌ ۖ وَاللَّهُ الْمُسْتَعَانُ عَلَىٰ مَا تَصِفُونَ ⑱

"ఇన్నల్లజీన జాఊబిల్ ఇఫ్కి ఉస్బతమ్ మిన్‌కుమ్" (ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చిన వారు, మీలోని ఒక వర్గంవారే) (24 : 11) నుండి ప్రారంభం అవుతాయి.

తదుపరి ఈ అపవాదును, అభాండాన్ని వేసిన నేరానికి మిస్తహ్ బిన్

https://teluguislam.net



అసాసా, హస్సాన్ బిన్ సాబిత్ మరియు హమ్నా బిన్తె హజష్ (ర)లకు ఎనభైయ్యేసి కొరడాల దండన విధించడం జరిగింది.[10]

అయితే ద్రోహి, నీచుడు అయిన అబ్దుల్లా బిన్ ఉబై వీపు ఈ కొరడాల బారిన పడకుండా తప్పించుకుంది. అభాండాలు వేసిన వారిలో అగ్రగణ్యుడు- అతడే ఈ వ్యవహారంలో ప్రముఖ పాత్రను పోషించినవాడు. అతనికి శిక్ష పడకపోవడానికి కారణం బహుశా, ఎవరికయితే దైవం నిర్దేశించిన శిక్షలు పడతాయో, వారి కోసం పరలోకంలో పడబోయే శిక్షల్లో తగ్గింపుగాని, క్షమాపణ గాని లభించడమే అయి ఉండవచ్చు. ఇహలోకంలో పడే శిక్ష వల్ల వారికి మన్నన లభించడం జరుగుతుంది. అల్లాహ్ అబ్దుల్లా బిన్ ఉబైకు పరలోకంలో భయంకరమైన శిక్షకు లోనుచేయదలచి ఉండడం వల్లనే ఇహలోక శిక్ష పడలేదు. ఈ కారణం మూలంగానే అతణ్ణి హతమార్చడం జరగలేదేమో.[11]

ఇలా ఒక నెల తరువాతగాని మదీనా వాతావరణం నుండి అనుమాన మేఘాలు దూరం కాలేదు. అబ్దుల్లా బిన్ ఉబై అగౌరవంపాలై తిరిగి తల ఎత్తుకోలేకపోయాడు. ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, అతను ఎప్పుడైనా నీచ కార్యానికి లేదా ముస్లిముల్లో భేదాభిప్రాయాలు సృష్టించడానికి ప్రయత్నిస్తే స్వయంగా అతని జాతివారే అతణ్ణి ఎత్తిపొడుస్తూ తిట్టేవారు. అతని ఈ పరిస్థితిని చూసి దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (ర)తో, "చూశావా ఉమర్! నీవు అతణ్ణి చంపివేయమని సలహా ఇచ్చిన నాడే అతణ్ణి హతమార్చి ఉన్నట్లయితే ప్రజలు మనలను తూలనాడేవారు కాదా? కాని ఈ రోజు అతనికి మరణ శిక్షను విధిస్తే వారే ఆ పని చేసిపెట్టేటట్లు ఉన్నారు" అనగా హజ్రత్ ఉమర్ దైవసాక్షి! ఈ విషయం నాకు బాగా అర్థం అయిపోయింది. దైవప్రవక్త (స) నిర్ణయమే నా నిర్ణయం కంటే మేలైన నిర్ణయం.[12]

---

10. ఇస్లామీయ చట్టంలో ఎవరయితే ఒకరిపై వ్యభిచారానికి సంబంధించిన అపవాదు వేస్తాడో దానికి తగిన సాక్ష్యాలు చూపకపోతే (ఆ అపవాదు వేసేవానికి) ఎనభై కొరడాల శిక్ష విధించాలని ఉంది.
11. సహీ బుఖారి-1/346, 2/696-698; జాదుల్ ముఆద్-2/113, 114, 115
12. ఇబ్నె హష్షామ్-2/293.